క్లుప్తంగా

ప్రైవేటు మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్ నాగారం: జిల్లాలో ప్రైవేటు మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని పీవైఎల్, పీవోడబ్ల్యూ సంఘాల నాయకులు మంగళవారం నిజామాబాద్ అర్బన్, రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రగతిశీల మహిళా, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, మెడికల్ షాపుల్లో సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వి గోదావరి, కె సంధ్యారాణి, డి నవీన్ కుమార్, ఎం సాయిబాబా, సత్యక్క, పిట్ల రమ, పద్మ, నాగమణి, సునంద, నర్సవ్వ, అమూల్య, నాగమణి, పావని, శాంత, సరిత, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖేల్ ఉత్సవాలు



తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడాపోటీల్లో ముందుండాలని తెయూ వీసీ టి యాదగిరి రావు సూచించారు. తెయూ ఏబీవీపీ కమిటీ ఆధ్వర్యంలో ఖేల్ ఉత్సవ్ క్రీడా పోటీల్లో భాగంగా రెండో రోజు వాలీబాల్ పోటీలను వీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో తెయూ స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, జాతీయ కార్యవర్గ సభ్యులు బి శివ, అమృతచారి, సాయికుమార్, నాగరాజు, సమీర్, అక్షయ్, లెనిన్, అజయ్, సతీశ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతపై శిక్షణ



నిజామాబాద్ సిటీ: నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో నగర వీధి విక్రయదారులకు ఆహార భద్రతపై మంగళవారం ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించారు. జాతీయ వీధి విక్రేతల సంఘం ఆధ్వర్యంలో ఆహార భద్రత, శుచి, శుభ్రత, హైజీన్ ఫుడ్ తయారీ వంటి వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మున్సిపల్ అధికారి రమేశ్ మాట్లాడుతూ.. నగరంలో వివిధ రకాల తిను బండరాలు తయారుచేసి విక్రయిస్తున్న వర్తకులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన పదార్థాలను విక్రయించాలన్నారు. వ్యాపారాలు చేసే పరిసరాలను సైతం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ సామగ్రిని వాడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఆహార భద్రత శాఖ ప్రాంతీయ జోనల్ అధికారి ఎంఏ ఖలీల్, జిల్లా ఇన్‌చార్జి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసు, రాము, ఫుడ్ సేఫ్టీ అధికారులు విక్రమ్, నవిత, జాతీయ వీధి విక్రేతల నాయకులు రంగా శాలివాహన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యువత రచనలు చేయాలి



నిజామాబాద్ రూరల్: యువ రచయితలు, కవులు రచనలు చేయాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ అన్నారు. తమ సంస్థ ద్వారా యువ రచయితలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేముల శేఖర్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- పాఠశాల, బస్తీ దవాఖానా ఆకస్మిక తనిఖీ
- విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం



మిర్చి కంపౌండ్‌లోని యూపీఎస్‌లో పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని మిర్చి కంపౌండ్‌లోని యూపీఎస్, ఉర్దూ పాఠశాల, బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే మంగళవారం తనిఖీ చేశారు. వచ్చే విద్యాసంవత్సరానికి మిర్చి కంపౌండ్ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపడతామని అన్నారు. తరగతి గదులకు వెళ్లి పాఠ్యాంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించే విధంగా తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంచేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలకు నాలుగు రోజుల నుంచి ఓ ఉపాధ్యాయురాలు రాకపోవడం, ప్రయివేటు టీచర్‌తో నడిపిస్తుండటంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు రాని విద్యార్థులు వచ్చినట్లు రిజిస్టర్‌లో హాజరు వేస్తున్నారని, గైర్హాజరైన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని డీఈవో అశోక్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు.

బస్తీ దవాఖానా నిర్వహణపై ఆగ్రహం..

బస్తీ దవాఖానాలో సకల వసతులు ఉన్నప్పటికీ.. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పేదలకు వైద్యం అందడం లేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. రిజిస్టర్‌లో మాత్రం ప్రతిరోజు 70మంది వరకు పేషెంట్లు వస్తున్నట్లు చూపుతున్నారని ఆరోపించారు. కాగా రిజిస్టర్‌లో నమోదు చేసిన రోగులకు ఎమ్మెల్యే ఫోన్ చేయగా, తమది నిజామాబాద్ కాదని జవాబు ఇవ్వడంతో వైద్యసిబ్బంది బాగోతం తేటతెల్లమైంది. దీంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను ఎమ్మెల్యే ఫోన్లో ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. డివిజన్‌లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్ కార్పొరేటర్ కల్పన మల్లేష్ గుప్తా, నాయకులు పవన్ ముందాడ, బంటు ప్రవీణ్, తారక్ వేణు, వనిత, సురేష్, తదితరులు ఉన్నారు.

సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె విరమణ

- మంత్రి హామీ మేరకు విధుల్లో చేరిన కార్మికులు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్ : పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హామీతో సివిల్ సప్లయ్ హమాలీల సమ్మెను విరమించినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి వై ఓమయ్య తెలిపారు. సివిల్ సప్లయ్ హమాలీలు, స్వీపర్ల సమస్యలపై సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్ బాలరాజు, ఓమయ్య తదితరులు మంగళవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా హమాలీల సమ్మె విషయమై చర్చించగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. కార్మికులకు సంబంధించిన ఫైల్ సీఎం పేషీలో ఉందని, రెండ్రోజుల్లో సంతకం చేయించి, జీవో ఇస్తామని స్పష్టమైన హామీనిచ్చారని, సమ్మె విరమించాలని మంత్రి కోరారని తెలిపారు. యూనియన్ నాయకుల హామీ మేరకు హమాలీలు, స్వీపర్లు సమ్మె విరమించి, విధుల్లో చేరారని ఓమయ్య పేర్కొన్నారు. ఏడు రోజులుగా యూనియన్ పిలుపు మేరకు ప్రభుత్వం దిగొచ్చేలా సమ్మె చేసిన కార్మికులకు ఏఐటీయూసీ జిల్లా సమితి పక్షాన ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో కార్మికులకు ఏ సమస్య వచ్చినా ఇదే ఐక్యత, ఉద్యమ స్ఫూర్తితో వ్యవహరించాలని కోరారు.

గిరిజన సాధికారత శిక్షణలో జిల్లా నాయకులు



మోపాల్: నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌లో ఏడు రోజులపాటు నిర్వహిస్తున్న గిరిజన సాధికారత శిక్షణ కార్యక్రమానికి కాంగ్రెస్ గిరిజన, ఆదివాసీ చైర్మన్ కెతావత్ యాదగిరి, యువజన నాయకుడు అజ్మీరా వినోద్ నాయక్ హాజరయ్యారు. ఆర్థికంగా, రాజకీయంగా వ్యక్తి ఎదుగుదలకు శిక్షణా కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని కెతావత్ యాదగిరి పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

మోపాల్: మండల కేంద్రంలో ఎస్సై యాదగిరి గౌడ్ మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 19 మంది వాహనదారులకు రూ.2100 జరిమానా విధించారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వాహన ధ్రువపత్రాలను తమవద్ద ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్సై రమేశ్‌బాబు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

కాకతీయ విద్యార్థుల ప్రదర్శనలు



నిజామాబాద్ అర్బన్: నగరంలోని కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు క్రీడోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వేణుమాల్‌లో విద్యార్థులు యోగాసనం, నృత్యాలు, ఆటల పోటీలు చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామోజీ రావు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా నిరాశ్రయ కేంద్రం పరిశీలన



మాట్లాడుతున్న సివిల్ జడ్జి పద్మావతి



వసతులను పరిశీలిస్తూ..

నిజామాబాద్ సిటీ: నగరంలోని మహిళా నిరాశ్రయ కేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి పరిశీలించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్‌రోడ్డులోని రేడియో స్టేషన్ సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళల కోసం రాత్రి షెల్టర్ హోం నిర్వహిస్తున్నారు. షెల్టర్ హోంలో ఉన్న మహిళలను, వారికి కల్పిస్తున్న సౌకర్యాలను జడ్జి స్వయంగా పరిశీలించారు. నిరాశ్రయ మహిళలతో మాట్లాడారు. వారి కోసం కేటాయించిన గదులు, మౌలిక వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహకులను అభినందించారు. అటెండెన్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. నిరాశ్రయులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తమకు భోజన వసతికల్పించాలని వారు జడ్జిని కోరారు. మున్సిపల్ ప్రాజెక్టు అధికారి చిదుర రమేశ్, మెప్మా సిబ్బంది మాధురి, శోభారాణి, అశోక్, సంతోష్, సవిత, శారద, లావణ్య, హారిక, అర్చన, సరిత, వర్డ్ మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

దాడులు చేయడం సరికాదు

నవీపేట: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సిగ్గుచేటని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మంత్రి రాజేందర్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించిందని దాడి చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు చేస్తే బీజేపీ నాయకులు చూస్తు ఊరుకోరని అన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో



తెయూలో..

నిజామాబాద్ నాగారం/ ఇందల్వాయి: జిల్లా వంజరి సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మమహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వంజరి సంఘం అధ్యక్షుడు బోనేకర్ భూమయ్య, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కరిపె రవీందర్, సభ్యులు బోడికె జనార్దన్, పోతన్కర్ రాజేశ్వర్, రాజు, సతీశ్, మధుసూదన్, దాత్రిక భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు. ఇందల్వాయి మండల బీసీ ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్‌ని ఎంఈవో శ్రీధర్, ఎస్సై మనోజ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాడవేడి వినోద్ కుమార్, జె శ్రీనివాస్, గంగామోహన్, ఇంద్రకరణ్, మురళి, సాగర్, స్వప్న, రజిత తదితరులు పాల్గొన్నారు.

తెయూలో..

తెయూ(డిచ్‌పల్లి): అఖిల భారత విద్యార్థి సమైక్య(ఏఐఎస్ఎఫ్) తెయూ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను వీసీ యాదగిరిరావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంజలి, సాయికుమార్, చందు, సంజయ్, గౌతమ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుకు ప్రోత్సాహం

- సబ్సిడీపై పందిరి సాగు, డ్రిప్ పరికరాలు..
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- జిల్లాకేంద్రంలోని గాంధీగంజ్, మార్కెట్ సందర్శన

సుభాష్‌నగర్: కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేలా ప్రోత్సాహకాలు అందిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని గాంధీగంజ్, కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం రోజురోజుకూ పడిపోయిందని, అన్ని కూరగాయలు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. కూరగాయల సాగు విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం సబ్సిడీపై పందిరి సాగు, డ్రిప్ పరికరాలు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తుందని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో పాడి రైతులకు సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. అందులోభాగంగా విజయ డెయిరీకి రూ.100 కోట్లు నిధులు కేటాయించిందని గుర్తుచేశారు. గేదెలను సబ్సిడీపై అందించి పాడిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేపడుతోందన్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ జంగిటి రాంచందర్, కాంగ్రెస్ ఫిషర్‌మెన్ చైర్మన్ బోర్గాం శ్రీనివాస్, ఎల్లయ్య, డైరెక్టర్లు, అధికారులు లాబన్, మధుసూదన్, ఖాదర్, శంకర్‌దాస్ పాల్గొన్నారు.



గాంధీగంజ్‌లో కూరగాయల విక్రేతలతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు స్వామి యాదవ్ డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంగళవారం నగరంలోని నార్త్, సౌత్ తహసీల్ కార్యాలయాల ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి నోరు మెదపడం లేదని ఆరోపించారు. బీసీల సమగ్ర కులగణన చేపట్టాలని, ప్రతి ఏడాది బడ్జెట్‌లో బీసీలకు రూ.20వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే గ్రామస్థాయి నుంచి బీసీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కోడూరు నాగరాజు, గిరిబాబు, మెట్టు విజయ్, సురేశ్, చిన్నకారి నరేశ్, మారుతీ, రాజ్‌కుమార్, గడ్డం రాజు, ముత్యాలు, గణేశ్, వినోద్, శ్రీను, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగర శివారులోని 11 కేవీ ముబారక్ నగర్ ఫీడర్‌లో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్-2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీడర్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, భాగ్యనగర్, శ్రీనివాస్‌నగర్, ఏకశీల నగర్, లక్ష్మీప్రియనగర్, జనప్రియ నగర్, తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గ్రహించి సహకరించాలని కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	79,600	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	73,445		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	15	గాజరుగడ్డ	40	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	50	80
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	40	60
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	20	40	బీట్‌రూట్	30	50
పాలకూర	15	30	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	30	50
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	30	50
పుదీనా	50	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మాక్స్(తెలుగు)-10.25,1.20, 10.30 మార్కో(తెలుగు)-4.15 పుష్ప-2(తెలుగు)-7.00
స్క్రీన్-2	ముఫాసా(తెలుగు)3డీ-1.20 పుష్ప-2(తెలుగు)-3.50 మార్కో(తెలుగు)-7.45,10.35
స్క్రీన్-3	ముఫాసా(తెలుగు)3డీ-10.50, 5.05,7.30 పుష్ప-2(తెలుగు)-1.10, 9.55

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2(తెలుగు)-10.20,2.45 మార్కో(తెలుగు)-7.10 ముఫాసా(3డీ ఇంగ్లీష్)-10.15
స్క్రీన్-2	ముఫాసా(3డీ తెలుగు)-11.00,1.50, 4.40,7.30 పుష్ప-2 (హిందీ)- 10.20
స్క్రీన్-3	మార్కో(తెలుగు)- 11.05 పుష్ప-2(హిందీ)-2.10 పుష్ప-2(తెలుగు)-6.15 బేబీజాన్(హిందీ)-10.40
స్క్రీన్ -4	క్రావెన్ ది హంటర్(తెలుగు)- 11.00,7.55 క్రావెన్ ది హంటర్(ఇంగ్లీష్)-5.00 మార్కో(తెలుగు)-1.55, 10.50
లలితామహల్	యుఐ(తెలుగు)-11.15, 2.15 విడుదల పార్ట్-2(తెలుగు)-6.15,9.15
దేవి	ముఫాసా(2డీ తెలుగు)
నటరాజ్	మ్యాక్స్(తెలుగు)-2.00,9.00 క్రావెన్ ది హంటర్- 11.00,6.00
విజయ్	పుష్ప-2 (తెలుగు)

రోడ్డు పక్కనే బావులు..

- ప్రమాదాలకు నిలయాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు



కేశ్‌పల్లిలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి



సికింద్రాపూర్ - కేశ్‌పల్లి రోడ్డు పక్కన ఉన్న బావి

జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్ల వెంట వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని సికింద్రాపూర్ 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి కేశ్‌పల్లి వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఆరు ప్రమాదకర వ్యవసాయ బావులు ఉన్నాయి. మండల కేంద్రం నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా మనోహరాబాద్ గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఈ రోడ్డు వెంట ప్రయాణించే పడకల్, మనోహరాబాద్, కలిగోట్, చింతలూర్, కొలిప్యాక్ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రి పూట ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. గతంలో మనోహరాబాద్ గ్రామానికి చెందిన కారు అదుపు తప్పి బావిలో పడిపోయింది. కారులో ప్రయాణిస్తున్న ఒకరు తీవ్రగాయాలకు గురై ప్రాణపాయం నుంచి తప్పించుకున్నాడు. ఈ రోడ్డును ఆనుకొని ఇరువైపులా సుమారు నాలుగు వరకు ప్రమాదకర బావులు ఉన్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పాడుబడ్డ బావులను పూడ్చాలని పలుమారుల అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఇరు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అంతే కాక నారాయణ్‌పేట్ నుంచి మునిపల్లి వెళ్లే రోడ్డులో సుమారు ఐదు వరకు ప్రమాదకర బావులు ఉన్నాయి. అర్గుల్ నుంచి అంకాపూర్ వెళ్లే దారిలో సైతం బావులు ప్రమాదకరంగా ఉండడంతో అటువైపు వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు భయం.. భయంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకర బావులను పూడ్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భయంతో ప్రయాణం..



మనోహరాబాద్-జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి వెళ్లే దారిలో సుమారు ఎనిమిది వరకు పాడుబడ్డ వ్యవసాయ బావులు ఉన్నాయి. రోడ్డు వెంట బావులు ఉన్నట్లు వాహనదారులకు దగ్గరికి వచ్చే వరకు కనిపించదు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ప్రమాదకర బావులతో భయం.. భయంతో ప్రయాణించాల్సి వస్తోంది. – గంగారాం, రైతు, కేశ్‌పల్లి

ప్రమాదాలు జరుగుతున్నాయి



రోడ్డు పక్కన వ్యవసాయ బావులు ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కేశ్‌పల్లికి వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా ఉంటుంది. రోడ్డు ఇరుకుగా ఉండడంతో పెద్ద పెద్ద వాహనాలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బావులను వెంటనే పూడ్చివేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. – భాస్కర్, కేశ్‌పల్లి

అధికారులు చర్యలు తీసుకోవాలి



మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం ప్రజలు ఈ రోడ్డు వెంటే ప్రయాణిస్తూ ఉంటారు. రోడ్ల వెంబడి ప్రమాదకర బావులతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ఉంది. ఉపాధి హామీ పథకం ద్వారా పాడుబడ్డ బావులు పూడ్చి వేయాలి. అధికారులు స్పందించకుంటే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. –గంగాసీను, రైతు, కేశ్‌పల్లి